బాగై ఇంటికివచ్చింది. మ్రొక్కుబడి ప్రకారం గొలగమూడి ఆశ్రమంలో సేవచేస్తున్నాను. నా పెండ్లి కాకముందు శ్రీస్వామివారికి చేసిన సేవకు ప్రతిగా నేను తలవకున్నా స్వప్నం ద్వారా గుర్తుచేసి నన్నురక్షించిన ఆ కరుణామయునకు ఏ విధంగానూ ఋణం తీర్చుకోలేను. ఏ బాధలు లేనప్పుడు శ్రీస్వామివారికి చేసిన సేవ ఎన్నటికీ వ్యర్ధం కాదు.

ఈ లీల ద్వారా మానవాళికి శ్రీస్వామివారు ఒక గొప్ప సందేశం వెయ్యి రెట్లు ఎక్కువగా అరచి బోధిస్తున్నారు. ఏమిటది? ఆపదలో మ్రొక్కడం అది తీరాక శ్రీస్వామివారిని మరచి పోవడం వ్యాపారమౌతుంది. కట్టా రామలక్ష్మమ్మగారు చిన్ననాడు శ్రీస్వామివారికి ఏ కోరిక లేకుండా సేవించింది. ఆ నాడు నిస్వార్ధంగా సేవించింది గనుకనే ఆపద సమయంలో ఆమె ప్రార్ధించకున్నా గాని తనను తాను స్వప్నం ద్వారా ఎరుక పరచుకొని ఆమె చేత ప్రార్థన చేయించారు. మనలను కూడా ఆపదలేనప్పుడు నిస్వార్ధంగా శ్రీస్వామివారిని సేనించమని బోధిస్తున్నారు. శ్రీ లక్కాకుల క్రిష్ణమూర్తి ఫార్మాసిస్టు, కలువాయి గారి అనుభవం కూడా ఇలాగే ఉంది. స్వామి కృప అనే పుస్తకంలో 24వ పేజి చూడగలము.


**Copy rights reserved.**

ప్రాప్తి స్థానము:- శ్రీస్వామి కృప పబ్లికేషన్స్, గొలగమూడి (వయా) సర్వేపల్లి - **524 321**. నెల్లూరు జిల్లా.



# వెన్నెల పువ్వులు

## (శ్రీ వెంకయ్య స్వామివారి దివ్యత్వం)




రచన:
ఆచార్య శ్రీ ఎక్కిరాల
భరద్వాజ

వెల: 1-50

# వెన్నెల పువ్వులు

సహస్ర కోటి సూర్యుల తో సమానంగా
జ్ఞాన తేజాన్ని విరజిమ్మి అజ్ఞానపు
చీకట్లను పారద్రోలేవాడు
సద్గురువు. ఆయన సహస్ర పూర్ణ
చంద్రుల చల్లదనంలో తమనా
శ్రయించిన వారి ఐహిక
పారమార్థిక తాపాన్ని హరిస్తాడు
గూడ. అట్టి ఆ పూర్ణ దత్తావతార
మైన శ్రీ శిరిడీ సాయినాథుని.
దివ్యతేజమే వివిధ మహనీయుల
రూపాలలో వెలుగుతోంది. అది
తెల్పే అనుభవ మణిమాలే
యీ వెన్నెల పువ్వులనే యీ
చిన్న గ్రంథం


ఆచార్య ఎక్కిరాల
భరద్వాజ



# వెన్నెల పువ్వులు

సహస్రకోటి సూర్యులతో సమానంగా జ్ఞాన తేజాన్ని విరజిమ్మి అజ్ఞానపు చీకట్లను పారద్రోలు తాడు సద్గురువు. ఆయన సహస్ర పూర్ణచంద్రుల చల్లదనంతో తమనాశ్రయించిన వారి అయిహిక పారమార్థిక తాపాన్ని హరిస్తాడు గూడ. అట్టి పూర్ణ దత్తావతారమైన ఆ శిరిడీ సాయినాథుని దివ్య తేజమే వివిధ మహనీయుల రూపాలలో వెలుగు తుంది. అది తెల్పే అనుభవాల మణిమాలే యీ వెన్నెల పువ్వులనే యీ చిన్నిగ్రంథం.

ఆచార్య ఎక్కిరాల భరద్వాజ.



# వెన్నెల పువ్వులు

**ఏకైక కర్తవ్యం:**

"దినయామిన్యే సాయం ప్రాతః శిశర వసంతే పునరాయతః" అని ఆది శంకరులన్నట్లు మన జీవితంలో రోజులూ రాత్రులూ సాయం ప్రాతః కాలాలు, శిశిర వసంతాది ఋతువులు తిరిగి పోతున్నాయి. బుద్ధుడు చెప్పినట్లు ప్రతి క్షణమూ మనం మృత్యువు వైపుకు అడుగిడుతున్నాము. ఒక వంక మన జీవితం గడువు తీరిపోతుందని, మనకున్న కాలం హారతి కర్పూరంలా అంతరించిపోతుందని, మనం పెనవేసుకున్న మమకారాలు నిరర్ధకాలని తెలుస్తూనే వుంటుంది. ఎవరూ నివారించలేని, ఎవరూ రక్షించలేని, ఎవరూ ఏదీ తోడు రాజాలని ఆ మహా భయం ఆసన్న మవుతున్నా అందుకు తగినదేమీ చేసుకోనివ్వకుండా ఎన్నెన్నో ఆశలు, మమతలు మనకు చుట్టుకుంటాయి. మనం చివరికి మోసపోవటం తథ్యమని తెలిసి నిస్సహాయులమవటమే మహా దుఃఖము. ఎన్ని పూజలూ జపాలూ చేసినా, మనలో ఎక్కువ మంది జీవితంలో ఇది నిజం. మరి మార్గమేమి?

ఈ నిత్య సమస్యకు ఋషులు మార్గము చెప్పే ఉన్నారు. మనం మరుస్తుంటాం. ఆ విషయంలో పండితులు, పామరులు, ధనికులూ, పేదవారూ ఒక్కటే. అందుకే



భగవంతుడు మహనీయుల రూపంలో అవతరించి కర్తవ్యాన్ని గుర్తు చేయటమే గాక దృఢమైన చేయూత గూడ యిస్తారు. అందుకే భగవద్గీత (4:34)లో, శ్రీకృష్ణుడు కూడా అట్టి వారిని ఆశ్రయించమని అత్యంత ప్రీతిపాత్రుడైన అర్జునునికి ఆప్తవాక్యంగా చెబుతాడు. అట్టి ఆప్తవాక్య సహితమైన గీతాసారాన్ని శ్రద్ధలేని వారికీ అసురీ గుణసంపద గల వారికీ చెప్పి వ్యర్థం చేయవద్దని హెచ్చరిస్తాడు. మనలో దానిని స్వీకరించగల వారికి సుగతి లేని వారికి దుర్గతీ తప్పదని స్ఫురణ. సద్ధర్మ రూపమైన కర్తవ్యాన్ని ఆచరించి ఆ ధర్మం చూపిన శ్రీరాముడు కూడా వశిష్ఠ, విశ్వామిత్రాది ఋషులను సేవించాడు. అవతార పురుషునికైనా తప్పని ఆ కర్తవ్యం మనకెలా తప్పుతుంది. దీనిని అశ్రద్ధ చేసిన వారికి రాత్రి, పగలు, శిశిర, వసంతాది ఋతువులు నిరర్ధకమైన ఆవేదనగా గడిచిపోక ఏమవుతాయి? అట్టి ఆప్తవాక్యాన్ని అనుసరించగల వారికి ప్రతిక్షణమూ సార్ధకం గాక ఏమవుతుంది. మన లౌకికమైన కర్తవ్యం మాత్రం నిర్వర్తించి, మనసా, వాచా, కర్మణా అట్టి మహనీయుల నాశ్రయిస్తే మన లౌకిక సమస్యలేమి కావలన్న ఆందోళన మనను నీడలా భయంలా వెంటాడుతుంది. అందుకే మనకట్టి అవకాశమీయడానికే వారు మన లౌకిక సమస్యలను అవలీలగా దాటిస్తారు. ఉదా:- శ్రీ చుండు నాగయ్యగారు చాలా కాలంగా ఇల్లు వదలి శ్రీస్వామివారి సేవలో ఉన్నాడు. ఇంటి దగ్గర నాగయ్యగారి

బిడ్డల పోషణ చూడవలసిన బాధ్యత ఆయనకు ఉంది. గనుక ఒక రోజు శ్రీస్వామివారు నాగయ్యను పిలిచి "మీగ్రామం వెళ్ళి నిమ్మచెట్లు గుచ్చిపెట్టి రమ్మ"ని ఆజ్ఞాపించారు. ఆ ఆజ్ఞకు బదులు చెప్ప కుండా వారి గ్రామం వెళ్ళి నిమ్మతోట వేసే ప్రయత్నం చేస్తే భార్యా పిల్లలు వద్దంటారు. తోటకు కంచె వేయడం, చెట్లకు నీళ్ళు పోయడం, దానికి బావి త్రవ్వడం. ఇదంతా కష్ట మన్నారు. శ్రీస్వామివారి మాట యందు అచంచలమైన విశ్వాసం గల నాగయ్యగారు నిమ్మచెట్లు గ్రుచ్చి శ్రీస్వామివారి సేవకు వచ్చేశారు. భార్య బిడ్డలు ఆ తోటను అయిష్టంగానే పోషించారు. ప్రస్తుతం ఆ తోటపై సంవత్సరానికి లక్ష రూపాయలకు పైన నిఖరాదాయం వస్తుంది. ఆవిధంగా శ్రీస్వామివారు నాగయ్యగారి లౌకిక సమస్యను అవలీలగా దాటించారు.

ఇదే విధంగా అక్కిం వెంకట్రామి రెడ్డిగారికి మిద్దె ఇల్లు కట్టించి నిమ్మతోట వేయించి వారి సమస్య తీర్చారు. పి. సుబ్బరామయ్య కొమార్తెకు స్టేట్ బ్యాంకులో ఉద్యోగం ఇప్పించడమే గాక ఉత్తమ సంబంధం కుదిర్చి వివాహం చేశారు. అంతేగాక ఉద్యోగం బాధ లేకుండా చేసి నిరంతరం గురు స్మరణ ప్రసాదించారు. పెన్షను వస్తుంది గనుక అన్నం సమస్య లేదుగదా. ఈవిధంగా శ్రీస్వామివారు తన్నాశ్రయించిన వారి సర్వ లౌకిక పారలౌకిక సమస్యలను పరిష్కరిస్తున్నారు. అయితే మనం వారిని హృదయ



పూర్వకంగా ఆశ్రయించడమే కావాలి. ఇలాటి సందర్భాలు శ్రీస్వామివారి చరిత్రలో ఎన్నో! అలా మనకు వారు ప్రసాదించిన తెరిపినీ, విశ్రాంతినీ వారిని స్మరించి చరిత్ర పారాయణ చేయడానికి వినియోగించుకోవాలని వారి సంకల్పం. అలా చేయని నాడు మన కర్మ మనకు గుణపాఠం చెబుతుంది. వైద్యుడిచ్చిన మందునూ, పథ్యాన్నీ అశ్రద్ధ చేస్తే అట్టి వాడికి ఆ రోగమే బుద్ధి చెబుతుంది. వారెన్నడూ మనకే పరీక్షా పెట్టరు. సర్వజ్ఞులైనవారికి పరీక్ష చేస్తేగాని మన సామర్థ్యమూ, అర్హతా తెలియక పోవడమేమిటి? విద్యార్థి యొక్క అశ్రద్ధ, పరీక్షలను అతడి పాలిటి అగ్ని పరీక్షగా మారుస్తుంది; శ్రద్ధావంతుడైతే అతడికది పరీక్షా సమయం కాదు. కేవలం విజయదినమే, పర్వదినమే అవుతుంది. మహనీయుని ఆశ్రయించ గల వారికి పరీక్షయనబడు అంతిమ ఘడియేలేదు. జీవితమే పర్వదినమూ విజయ ఘడియయై అతడు కృతకృత్యుడౌతాడు. కారణం అతడు చేయ వలసినది సక్రమంగా పూర్తి చేసిన వాడౌతాడు. ఇలా భూమి మీద మానవులకు మహనీయుల రూపంలో ఎల్లప్పుడు లభించి కర్తవ్యబోధ చేసి ఆలంబనమిచ్చే కృపాతత్వమే బ్రహ్మ విష్ణు మహేశ్వర పరబ్రహ్మ స్వరూపియై గురువుగా అవతరించే తత్వమే శ్రీదత్తాత్రేయుడు. ఆ భగవదనుగ్రహమే వివిధ మతాలవారికి వారివారి ప్రవక్తల, మహనీయుల రూపాలలో అవతరించి చేయూత నిస్తూవచ్చింది. కాల గతిలో ప్రవక్తలు

చూపిన ఆచరణ, యాంత్రికమూ, లాంఛనప్రాయమూ అయిపోయినపుడు దాని హృదయాన్ని తెల్పేందుకు ఆయామతసంప్రదాయాలలో మహానీయులవతరించి పిలవగానే భగవంతుడు పలికేలా ప్రార్థించడమెలాగో, ధర్మమాచరించడమెలాగో ఆయా మతస్థుల వారికి తెల్పుతారు. ఇట్టి మహానీయులందరూ కుల మత భేదాలకతీతులుగా ఉండి ఎవ్వరి ధర్మాన్ని వారు సార్థకంగా ఆచరించటము నేర్పుతారు. అట్టి పూర్ణ దత్తాత్రేయ తత్త్వమే భగవాన్ శ్రీ వెంకయ్య స్వామిగా వెలిసింది. కనుకనే దత్తావతారమైన శ్రీ సాయినాథుని చరిత్ర పారాయణ, నామ స్మరణ చేసే ముముక్షువులకు శ్రీ వెంకయ్యస్వామివారు తమ ఆశీస్సులు, సేవ, దర్శన భాగ్యాలను అనుగ్రహిస్తున్నారు. అట్టి ఆత్మ జ్ఞానియైన సద్గురువును శరణుపొందడం వలన ఇహ, పర శ్రేయస్సుకవసరమైనదంతా అదే సమకూడుతుంది. ఇది చి|| పి. సుబ్బరామయ్య విషయంలో ఎలా నిజమైందో తరువాత చూస్తాము.

ఈ ధర్మసూక్ష్మాన్ని మరచి సద్గురు సేవను అశ్రద్ధ చేసి కేవలం దేవతారాధనలో మునగడం వలన మత ధర్మాలన్నీ యాంత్రికము, లాంఛనప్రాయమూ అవుతున్నాయి. దైవారాధకుడు, ముముక్షువు సాత్వికమైన దైవసంపద కలవాడైతేనే రామకృష్ణ పరమహంసను తోతాపురియను జ్ఞానినాశ్రయించమని ఆదేశించినట్లు, దైవం సద్గురువు నాశ్ర



యించమని ఆదేశించడం జరుగుతుంది. అతడు రాగ, ద్వేషయుతుడైన పామరుడైతే అజ్ఞానంతో అతడు కోరినకోరికను దైవం నెరవేర్చి గుణపాఠం చెబుతుందని వారి దుష్టసంస్కారాలను సంస్కరించదని పురాణ కథలన్నీ నిరూపిస్తున్నాయి. ఉదా:- భస్మాసురుడు, సద్గురువలాకాక అతనిని సంస్కరించి ఉత్తమ మార్గాన నడుపుతాడు. కనుకనే శ్రీ కృష్ణుడు గీతలో అర్జునునితో అట్టి వారినాశ్రయించ మన్నాడు. ఇక్కడ మానవులంతా రెండు పొరపాట్లు చేస్తున్నారు.

1. సద్గురువు నాశ్రయించక పోవడం.
2. దైవీ సంపదను అలవరుచుకోక పోవడం.

ఈ దైవీ సంపదనే భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారు సంపన్నత్వం అన్నారు. సంపన్నత్వం సాధారణత్వం కల్గి యుండు. సత్యం ధర్మం తప్పవద్దు, సద్గురు సేవ కలిగి యుండు అని మానవాళికి తన చివరి సందేశాన్ని అదేపనిగా ఈ ఐదు సూత్రాలను రాత్రింబవళ్ళు కొన్ని రోజులు పాటు అరచి బోధించారు. తాను సత్యం, ధర్మం తపొద్దు అని అరుస్తూ తన సేవకుల చేత పెద్దగా అరిపించే వారు. వారు కొంత సేపు అరిచి అలసిపోయి నిద్ర తూగితే ఏమయ్యాచెప్పవు? అని అడిగేవారు. ఆ సేవకుడు అరవలేకుంటే మరొకరు కూర్చొని

అరుస్తుండాలి. సత్యం, ధర్మం తప్పవద్దు అనేది రెండు మూడు రోజులు అరిచి ఆతర్వాత మరలా సంపన్నత్వం, సాధారణత్వం సాధించు అని అరచేవారు. రెండు మూడు రోజులు రాత్రింబవళ్ళు అరిచాక ఆ తర్వాత సద్గురు సేవ సాధించు అని రెండు మూడు రోజులు అరిచేవారు.

ఈ మహానీయునివలె రోజులు తరబడి రాత్రింబవళ్ళు అరచి మానవాళికి తన చివరి సందేశం అందించిన మహానీయుడేలేడని చెప్పాలి. మానవాళిని ఉద్ధరించేవి, ఈ ఐదు సూత్రాలేనని ఈ మహానీయుని నిర్ణయం.

**1. సత్యం, 2. ధర్మం, 3. సంపన్నత్వం**

**4. సాధారణత్వం, 5. సద్గురు సేవ.**

అట్టి గుర్వనుగ్రహము కలగడానికి సాధనాలు శ్రీసాయిలీలా మృతము, శ్రీ గురు చరిత్ర పారాయణలేనని చి||పి. సుబ్బరామయ్య అనుభవం నిరూపిస్తుంది. కనుక దత్త రూపమైన భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి చరిత్ర పారాయణ, నామ స్మరణమే మన పరమ కర్తవ్యము, పరమ ధర్మము. మహనీయులనాశ్రయిస్తే మన లౌకిక సమస్యలేమి కావాలన్న ఆందోళన మనను నీడలా భయంలా వెంటాడుతుంది. అందుకే మనకట్టి అవకాశమీయడానికే వారు



మన లౌకిక సమస్యలను కూడా అవలీలగా దాటిస్తారు. అలాంటి సందర్భాలు శ్రీ స్వామివారి చరిత్రలో కోకొల్లలు. అలా వారు మనకు ప్రసాదించిన తెరిపినీ, విశ్రాంతినీ, వారిని స్మరించి చరిత్ర పారాయణ చేయడానికి వినియోగించుకోవాలని వారి సంకల్పం. అలా చేయనినాడు వారు మనలను మన ఖర్మకు మనలనొదిలేస్తారు. "పోయ్యేవాళ్ళను పోనిచ్చేదేగదా" నన్నారు. గనుక స్వామివారు ఒక వంక ఆర్తులను రక్షిస్తూ మరియొక వంక వారిని ధర్మ మార్గంలో మానవ ధ్యేయమైన మోక్షం వైపుకు నడప ప్రయత్నించారు. ప్రయత్నిస్తున్నారు.

ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం వలన దైవశక్తి పట్ల అపనమ్మకపు బీజాలు మానవుల హృదయాలలో వెంటాడుతూ వారి పూజలు, వ్రతాలు నిష్ఫలమయ్యేలా చేస్తున్నాయి. ఇట్టి వారికి స్వామివారి దివ్య లీలలు కనువిప్పు కల్గించి దైవంపట్ల ఘాఢమైన విశ్వాసం కలిగేలా చేస్తున్నాయి. ఉదా:- నెల్లూరు జిల్లా కోవూరులో ఒక టీచర్ ఉన్నాడు. వీరు పరమ నాస్తికులు. చాల చక్కగా ఉపన్యసించి, జనాన్ని అమితంగా ఆకర్షిస్తారు. వీరి నిమ్మతోటకు తెగులు సోకి చాలా దయనీయంగా తయారైంది. ఎన్నో మందులు స్ప్రేచేశారు. లాభం లేకపోయింది. కన్నుల ఎదుటే లక్షలు విలువ చేసే నిమ్మతోట అలా అవడం అతనిని చాలా కలవరపెట్టింది. అట్టి ఆపద సమయంలో ఎవరో ఒక మిత్రుడు శ్రీ వెంకయ్య

స్వామివారిని గూర్చి చెప్పి అక్కడ నుండి విభూతి తెచ్చి చల్లుకో, చెట్లు బాగుపడుతాయని సలహా యిచ్చాడు. విభూతి గుడ్డలో వేసి మూటగట్టి నీళ్ళలో వేసి జిలకొట్టి ఆ విభూతి కలిసిన నీటిని స్ప్రేయరుతో చెట్లకు కొట్టి గుడ్డలో మిగిలి పోయిన విభూతిలోని పిప్పిని చెట్ల మొదళ్ళ దగ్గర చల్లాడు. అతని కన్నులే నమ్మలేనట్లు ఒక్కవారంలో తోటంతా కనులు మిరుమిట్లు గొల్పుతూ చక్కగా చిగురించి శోభాయమానంగా తయారైంది.

"దేవుని విషయంలో నా వాదనలన్నీ మూలబడ్డాయి. శ్రీ వెంకయ్య స్వామివారే నాకు దేవుడని నేను హృదయ పూర్వకంగా విశ్వశిస్తున్నాను." అంటారీ టీచర్. కనుక ఈ టీచర్ గారి విశ్వాసాన్ని ఇక ఏ వాదనలూ ప్రక్కదోవ పట్టించలేవు గదా. సద్గురు మహిమ అంటే ఎలా ఉంటుందో తెలిపేదే ఈ నిమ్మ తోట ఉదంతం.

సకల సృష్టి పైన స్వామివారికి గల ప్రేమ వర్ణనాతీతము. ఆయా ప్రాంతపు ప్రజల సామూహిక కర్మ ఫలితంగా అనావృష్టి సంభవించినప్పుడు వారి కర్మను, యోగ శక్తితో దహించి సంతృప్తిగా వర్షం కురిసేంత వరకు, ఒక్కొక్కప్పుడు ఐదు రోజులు రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని నిష్ఠలో నున్న రోజులు గలవు. కనుకనే స్వామివారు సంచరించిన ప్రాంతాలకు స్వామివారి ఆశ్రమం నుండి ఎవరు వెళ్ళినా వారిని సాక్షాత్తు స్వామిని ఆదరించినట్లు



ఆదరిస్తారంటే స్వామి ఎడల వారికి గల ప్రేమ ఏమని చెప్ప గలము. ఉదా:-

బ్రాహ్మణ పల్లి గ్రామ కాపురస్తుడు శంకర రెడ్డి గారి నుండి శ్రీ స్వామివారిని గూర్చి అడిగి తెలుసుకోవాలని వెళ్లారు. అప్పుడు మధ్యాహ్నం 1గం.30 నిమషములు అయింది. రోడ్డులోని ఒక బంకు దగ్గరుండే వాళ్ళను శంకరరెడ్డిగారి ఇల్లు ఎక్కడని అడిగారు. "ఆయన చాలా పిసినారి. ఈ టైంలో పోతే వాళ్ళింటిలో మీకు అన్నం పెట్టరు. ఈ బంకు దగ్గరే ఏదైనా తినిపోండి. లేకుంటే ఈ ఎండలో తిరిగి మీరు ఆకలి తీర్చు కునేందుకు ఇక్కడికే రావలసి ఉంటుంది" అని చెప్పారు. వాళ్ళ మాట వినకుండా వీరు ముందు శంకరరెడ్డి గారింటికే వెళ్ళారు. బంకు దగ్గర వాళ్లు చెప్పిన మాటలన్నీ తారు మారైనాయి. వీరు శ్రీ వెంకయ్య స్వామివారి ఆశ్రమం నుండి వస్తున్నామని విన్న వెంటనే శంకరరెడ్డి గారు వీరిని ముందు అన్నం తినమని తొందర చేశారు.

వీరికి చక్కని భోజనం పెట్టి, ఎంతో ఆదరించి ఆ తరువాత వీనుల విందుగా శ్రీ స్వామివారిని గూర్చి ఎన్నో విషయాలు చెప్పారు. వారి ప్రవర్తన ద్వారా వారికి శ్రీ స్వామివారంటే ఉండే పూజ్య భావమెంతో తెలుస్తుంది. ఇదే విధంగా ఆ గ్రామంలోని పలువురు వీరిని ఆదరించారు. దీన్నిబట్టి శ్రీస్వామివారంటే వారికెంతటి భక్తి ప్రేమలున్నాయో

తెలుస్తుంది.

ఈ శంకరరెడ్డిగారు ఒక చిత్రమైన శ్రీస్వామివారి లీలచెప్పారు. ఒక రోజు తాను వేసవి కాలంలో కపిల తోలి ఎద్దులను ఇంటికి తోలుకొస్తున్నాడు. చాలా లోతులో నున్న నీళ్ళను కపిల ద్వారా లాగిన ఎద్దులు చెమటలు పట్టి నీళ్ళు మేత కొరకు అవురావురు మంటూ ఇంటికి పోతున్నాయి. శ్రీస్వామివారు మార్గమద్యంలో చెట్టు క్రింద ఉండి శంకరరెడ్డిని రమ్మని పిలిచారు. "స్వామీ! ఈ మూగజీవుల బాధ చూడండి. కపిల లాగ లేక చస్తున్నాయి. వీటికి నీళ్ళు, మేత చూసి వస్తాను" అని చెప్పి పోతున్నాడు. "ఎంత సేపు లేయ్యా, ఈరొవ్వంత సేపే గదా" అన్నారు శ్రీస్వామివారు. చిత్రంగా కొద్ది సేపటిలోనే కుంభవృష్టిగా వర్షం కురిసి చెరువులన్నీ నిండాయి. ఎద్దులకు లోతునుండి నీళ్ళు లాగే బాధ తప్పింది. శ్రీస్వామివారు ఆ ఎద్దుల బాధ చూచి ఎంతగా జాలి చెందారో గానీ వెంటనే వర్షం కురిపించారు. ఈ విషయం శంకర రెడ్డిగారికి తప్ప మరెవ్వరికీ తెలియదు. ఇది శ్రీస్వామివారి కరుణకొక నిదర్శనం.

ఆ రోజులలో పశువులకు, గొఱ్ఱెలకు, మేకలకు జబ్బులు వస్తే మందలు మందలుగా చనిపోయేవి. మనుషులకు కలరా, మశూచి వస్తే గ్రామమంతా తుడిచి పెట్టుకు పొర్యేరోజులు. అట్టి భయంకర పరిస్థితులలో స్వామివారు ప్రసాదించే దారం, సాంబ్రాణి వారికి శ్రీరామ



రక్షయై రక్షించేవి. అట్టి అనుభవాలు పొందిన భక్తులు నేటికీ అలాంటి జబ్బులు వస్తే స్వామివారి సమాధిని ఆశ్రయించి రక్షణ పొందుతున్నారు.

స్కైలాబ్ భారత దేశంలో పడుతుందని అందరు భయ భ్రాంతులైనట్టి తరుణంలో కూడా స్వామివారు "అది ఎక్కడో నీళ్ళలో పడుతుంది లేయ్యా" అని అభయమిచ్చి సకలజీవుల దుఃఖాన్ని నివారించారు.

స్వామివారు సంచరించిన ప్రాంతాలన్నీ ఎంతో బెట్ట ప్రాంతాలు. ఆర్థికంగా బాగా వెనుకబడిన ప్రదేశాలు. నేడా పల్లెల్లన్నీ ఎంతో సస్యశ్యామలంగా ఉన్నాయంటే అది స్వామివారికి భిక్షనిచ్చిన భాగ్యమే. "వెంకయ్య పేరుమీద పిడికెడు మెతుకులు పెట్టిన వారికి, తెచ్చిన వారికి వారి మంచిచెడ్డలన్నీ మనం చూడొద్దయ్యా" అని అభయం ఇచ్చియున్నారు గదా. ఉదా:- గొలగమూడిలో ఒకప్పుడు వర్షాధారపు సేద్యము. నార్లు పొయ్యాలన్నా, నార్లు నాటాలన్నా వర్షం కావాలి. కాని నేడు సోమశిల డ్యాం వలన వర్షాధారం పోయి సస్యశ్యామలమైంది.

స్వామివారు భక్తరక్షణ చేయడమేగాక మనందరి కొరకు ధర్మాన్ని ఆచరించి చూపారు.

నియమపాలన:- ప్రపంచం తల్లక్రిందులైనా తన నియమం తప్పేదిలేదు. ప్రయాణంలో శిష్యులు రేక తెచ్చేందుకు మరచి పోయినప్పుడు మూడు రోజులు

ఆహారం లేకపోయినా తాటాకురేక వచ్చే వరకు గంజి త్రాగలేదు. పిడుగులు పడినా గాని వర్షం వెల్లువలైన సరే ఫలానిచోట ఇన్నిగంటలు అగ్నిహోత్రం వ్రేల్చాలంటే వ్రేల్చి తీరవలిసిందే. ఫలాని చోట ఇన్ని గంటలు ఉండాలంటే అన్ని గంటలకు ఒక నిమిషం కాలం కూడ ఎక్కువ ఉండేందుకు వీలు లేదు.

వైరాగ్యం:- పాతగుడ్డలు, గోనెసంచులు, అల్యూమినియం దబరలు, తాటాకుచాపలు తప్ప ఇతరత్ర ఏమీ వాడేది లేదు. ఊర్లో నాగతాత పాతగుడ్డలు అడిగితెస్తే వాటిలో చినుగు లేనివి చూచి వద్దని పారేసేవారు. చినిగినవే తీసుకునే వారు. బలవంతంగా ఇచ్చి వెళ్ళిన విలువైన బెడ్ షీట్ ను మూడంగుళముల వెడల్పుముక్కలు చేసిందాకా ఒప్పుకోలేదు. విలువైన జిప్ బ్యాగ్ ఇస్తే మంటలో వేసి కాల్చిందాకా నిద్రపట్టలేదు. ఎట్టి పరిస్థితులలోను భిక్షాన్నం తప్ప విందులు ఆరగించే వారు కాదు. పండుగనాడైన భిక్షాన్నం తేవలసిందే. ఏనాడు రుచిని పట్టించుకొని ఎరగరు. ఉదా:- ఆకలైనప్పుడు లడ్డు పెట్టినా తింటారు. కాని దాని రుచి చంపేందుకు దానిలో పచ్చి మిరప్పొడి కలిపి తినేవారు. చలి బాధ ఎంత దుర్భరమైనా ఎంత ఎండ తీవ్రతైనా సరే గృహస్థుల ఇళ్ళలో ప్రవేశించి ఎరగరు. పాడుబడ్డ దేవాలయము, చెట్లు, గ్రామ చావడి మొదలగునవి వారి నివాస స్థానములు. పర్యటన లేకుండా తనకు తన బృందానికి మంచి



వసతులు లభిస్తున్నవని ఏ గ్రామంలోను నిలకడగా శాశ్వతంగా ఉన్నది లేదు. **24** గంటల సేపూ బ్రహ్మంలో లీనమై ఉండే చివరి రెండు సంవత్సరముల వరకు కనీసం దోమతెర వేయుటకుగాని, మంచు సోకుతుందని పందిరి అమర్చడంగాని స్వామి అంగీకరించి ఎరుగరు. కాళ్ళు పట్టుకుపోయి నడవలేని పరిస్థితిలో కూడా నాల్గు అంగుళముల ఎత్తు చక్రములు గల బండిలో మైళ్ళతరబడి ప్రయాణంచేయుటం వారికే తగింది. ఎంత మంది ప్రాధేయపడినా ఆంజనేయస్వామి గుడికి ప్రహరీ కట్టించారేగాని, చిన్న ఇల్లైనా తనకొరకు వేసేందుకు అంగీకరించలేదు.

త్యాగం:- ధన, కనక, వస్తు వాహనములు దానం చేయుటం చూస్తామేగాని ఇతరులను ఆదుకొనుటకు శరీరాన్ని బాధలకు గురి చేయుటం ఎక్కడా చూడము. కుష్ఠు వ్యాధి పీడితుల బాధ, చెలిది వ్యాధి పీడితుల జిల లాంటి అనేక భక్తుల బాధలను స్వామివారే తమ శరీరంతో అనుభవించి వారికి సేద తీర్చారు. ప్రపంచంలో ఇంత కంటే మించిన త్యాగమెచ్చటచూడగలం. అట్టి త్యాగశీలికి మనమేమిచ్చి ఋణము తీర్చుకొనగలము. అలాంటి త్యాగం మనం కూడా ఆచరించినప్పుడు దైవ కృప పొందగలము.

ధర్మనిరతి:- ఏనాడు తన బృందంలోని వారందరి భోజనాలు పూర్తి కాక ముందు స్వామివారు గంజి త్రాగి

ఎరుగరు. ఎంతటి రుగ్మతలో నున్నాగాని, ఎంత తొందర ప్రయాణంలో నున్నా ఆర్తితో తనను స్మరించినవారి బాధలు తీర్చే వరకు అడుగు కదిల్చేవారు కాదు. ఒక రోజు కలిచేడు కల్యాణరాం గని దగ్గర శ్రీస్వామివారు ఉన్నారు. ఆ గ్రామం నుండి వెంటనే మరొక గ్రామం పోవాలని బండి తీసుకరమ్మన్నారు. వ్యవసాయపనుల కాలమైనందున బండి దొరకలేదు. శ్రీస్వామివారు తొందర చేయుచున్నందున ఎంతో కష్టంమీద ఒక భక్తుని అభ్యర్థించి బండి తెచ్చారు. సామానంతా బండికెక్కించి శ్రీస్వామివారిని బయలు దేరమంటే "పొయ్యేందుకు వీలు లేదు. బండి వానికి ఆరు రూపాయలిచ్చి పంపించండి" అని పలుమార్లు చెప్ప సాగారు. ఇక తప్పింది కాక సామాను దించేశారు. అప్పుడొక యానాది మనిషి కడుపు నొప్పితో బాధపడే తన బిడ్డను తీసుకొని ఏడుస్తూ శ్రీస్వామిని శరణు వేడింది. ఎవ్వరినీ తాకని శ్రీస్వామివారు ఆ బిడ్డను కంఠమునుండి పాదములవరకు ముమ్మారు సరదీయగానే ఆ బిడ్డను 4 రోజులుగా బాధిస్తుండిన కడుపు నొప్పి మాయమైంది. ఆ బిడ్డ వస్తున్నాడనే శ్రీస్వామివారు బండి ఎక్కలేదు. ఆపదలో తనపై విశ్వాసముతో తన నాశ్రయించే మిషతో ఆమె వస్తుంటే తాను అక్కడ నుండి బండిలో వెళ్ళడం అధర్మమని శ్రీస్వామివారి భావన. గనుకనే ప్రయాణమును మానుకొని బండి వానికి ఆరు రూపాయలు ఇచ్చి పంపారు. ఆ రోజు శ్రీస్వామివారి వలన ఆ



బండి వానికి పని లేకుండా పోయింది. గనుక ఆరోజు కూలి శ్రీస్వామివారే ఇచ్చారు. ధర్మమంటే ఎలా ఉంటుందో మాహనీయుల ఆచరణచూచి నేర్చుకోవలసినదే, కానీ మనం మాటలతో ధర్మం గూర్చి మాట్లాడలేము. వారిలాగ మనం గూడ ధర్మమాచరిస్తే దైవ కృప పొంద గలుగుతాము. అట్టి సమయాలలో తనకొరకు వచ్చిన బండివానికి పని లేకపోయినా బాడుగ ఇచ్చి పంపందే వప్పుకోరు. తనను సేవిస్తుండే భక్తులపై ఆధార పడియున్న కుటుంభ సభ్యుల భాద్యత శ్రీస్వామివారు పూర్తిగా వహించి వారందర్నీ అనుక్షణమూ ఏమారక కాపాడే వారు. ఒక రోజు రోశిరెడ్డి (చుండు నాగయ్య) ని తన చిన్న కొమారుని పేరు వ్రాసి ఒక చీటీ ఇమ్మని తొందర చేసి ఆ చీటీ తన తొడ క్రింద పెట్టుకొన్నారు. తన కొమారుణ్ణి ఏదో గండం నుండి శ్రీస్వామివారు రక్షించారని రోశిరెడ్డి అనుకొన్నాడు కానీ వివరం తెలియలేదు. మూడవ రోజు రోశిరెడ్డి కొమారుడు వచ్చి శ్రీస్వామివారు తనను ప్రాణ గండం నుండి రక్షించిన విధం వివరించాడు.

తాను మామిడి కాయలు భర్తీ వేసిన బండి తోలుకొని ఒక కొండ ఎక్కుతున్నాడు. ఎద్దు అనిక వేసుకొని కాడి మెడ మీద నుండి ప్రక్కకు తొలిగింది. అందు వల్ల ఎక్కుడులో పోతున్న బండి క్రమంగా వెనుకకు దొర్ల సాగింది. బండిని నిలుపలేక పోయాడు. బండి, ఎద్దులు, తాను షుమారు నలభై అడగుల లోతులోని వాగులో పడి పోయారు. అంత ఎత్తులో

నుండి పడి పోతే బండికి గాని, ఎద్దులకు గాని, తనకు గాని ఎలాంటి దెబ్బ తగల లేదు. మామూలుగా అయితే బండి ఎద్దులు తాను నుగ్గు నుగ్గు అయి ఉండాలి. తాను ఈ విధంగా రక్షింప బడడం కేవలం శ్రీస్వామివారి కృపవలననే జరిగిందని శ్రీస్వామివారికి తన కృతజ్ఞతలు తెలిపేందుకే వచ్చానని చెప్పాడు. శ్రీస్వామివారు ఆయన పేరు వ్రాసిన చీటీని తొడక్రింద పెట్టుకున్న సమయంలోనే ఈ యాక్సిడెంటు జరగడంతో ఈ చిత్రమైన విషయం శ్రీస్వామివారి దయవల్లనే జరిగిందని అందరూ తెలుసుకొన్నారు. ఈ విధంగా తన నాశ్రయించిన వారందరినీ రాత్రింబవళ్ళు కంటిని రెప్పవలె కాపాడేవారు. నేటికీ కాపాడుతున్నారు. తనకు ఏదైనా ధర్మంకాదని తోచినప్పుడు పైవాళ్ళు వప్పుకోరయ్యా అని చెప్పేవారు. ఇట్టి మహనీయుని నోటి వెంబడి ఏమాట వచ్చినా జరిగి తీర వలసిందే. వెంకయ్యది ఒకటే మాట కదయ్యా అని చెప్పే వారు.

ఓర్పు:- భూదేవి కంటే మించిన ఓర్పు కలవారు. ఎంతటి దుర్మార్గునికూడా వీసమెత్తుమాట అని ఎరుగరు. స్వామివారి మహిమ తెలియని దుండగి స్వామివారి చెంపపై ఒక దెబ్బ కొట్టినప్పుడు కూడా నోరు విప్పి ఎరుగరు. నోరు విప్పకూడదయ్యా అనేదే వారి సందేశం. తన జీవితకాలమంతటిలో ఏవ్యక్తిని నిందించిగాని పొగిడి కాని ఎరుగరు. ("నాభినందతి నద్వేష్టి.") మనం అన్నం దగ్గర



కూర్చొని అదే కూర ఏయమ్మ ఎలా తయారు చేస్తారో చెప్పుకుంటుంటాము. ఎవరెవరు ఎలాంటి వ్యక్తులో చెప్పుకుంటాము. ఇదంతా సాధనని భ్రమిస్తాము.

ఇట్టి మహత్తర దైవీసంపదతో విరాజిల్లుచూ సాధారణ మానవుని వలే మనమధ్య సంచరించినవారి సాధారణత్వమునేమని కొనియాడగలము. ఇదంతయు మన కొరకు ఆచరించి చూపిన ధర్మ మార్గం మాత్రమే. "నేనే పరమాత్మనని, నాకు గురువెందుకయ్యా?" అని పలికినస్వామికి, ఇట్టి ఆచరణతో పనిఏమి? మాకేదైనా బోధించమన్నప్పుడు, చూచి నేర్చుకోండయ్యా అన్నారే గాని ఎవరికెట్టి మంత్రోపదేశం చేయులేదు. ఇట్టి మహాత్ముని గూర్చి, వారి ప్రేమతత్త్వాన్ని గూర్చి ఎంతవ్రాసినా వెలితే అవుతుంది. అవాఙ్మానసగోచరుని తత్త్వాన్ని మాటలలో వ్రాయగలమా? లోక కళ్యాణ నిమిత్తమే అవతరించిన ఆ మహాత్ముని తత్త్వాన్ని దివ్య లీలల్ని చూద్దాం.

పచ్చి త్రాగుబోతులను సాత్వికులుగా చేయుటం కంటే లోక కళ్యాణమేముండగలదు. భార్యలను వదలి పరస్త్రీల పంచనపడియున్న మగధీరుల మనసుమార్చి వారి కాపురం నిలబెట్టడం కంటే కళ్యాణమేం కావాలి. స్వామితో అనుభవం కలిగి కృతజ్ఞతతో ధర్మాన్ని ఆచరించడం కంటే ఎక్కువగా ప్రజలకు ధర్మాచరణ ఎవరు నేర్పగలరు. మానవులు బాధ్యతా యుతంగా ధర్మాన్నాచరిస్తే రామరాజ్య స్థాపన జరిగినట్లే గదా!

అట్టి మార్పు స్వామివారి భక్తులలో మనం చూడ వచ్చు. ఇంత కంటె లోక కళ్యాణమేం కావాలి?

చూచి నేర్చుకోండయ్యా అన్నారు. ఎక్కడో, ఎవరినో చూచి నేర్చుకునే దాని కంటే శ్రీస్వామివారినే చూచి నేర్చుకోవడం ఉత్తమం గదా. రాకన్ మానవు హాని వృద్ధులు మహా ఘోరారణ్యంబునన్ దాగినన్ అన్నదే వారి ముఖ్య జీవిత సూత్రము. తన జీవితావసరాలైన తిండి బట్ట నీడల గూర్చి ఏనాడూ ఒక్క ఆలోచన గూడా రానిచ్చి ఎరుగరు. మనకు రావలసినవి ఎలాగైనా వచ్చి తీరుతాయి. రాని వాటిగురించి మనమెంత ప్రయత్నించినా రావు. గనుక వాటిని గూర్చి ఆలోచన లేకుండా జీవించడమే మనం నేర్చుకోవలసింది. ప్రొద్దు కూకుతుందంటే రాత్రంతా అగ్ని వ్రేల్చుటకు కట్టెలున్నాయా లేదా అని చూచి అడిగే వారు. రాత్రి 8 గం. అయితే భజన వాళ్ళు ఇంకా రాలేదాయ్యా? అని అడిగేవారు. వీటి రెంటికి మాత్రమే తన జీవితంలో ప్రాధాన్యతనిచ్చారు. అలాగే మనలనూ జీవించమని తన ఆచరణ ద్వారా బోధించారు.

1. అన్నపానీయాల కొరకుగూడ ప్రయత్నించకుండా జీవిత ధ్యేయం కొరకు శ్రమించడం.
2. ప్రాణాలను కూడా లెక్క చేయని కఠోరమైన నియమ పాలన.
3. నిర్విరామంగా సాటి జీవుల కొరకు శ్రమించడం.



4. ఏమరు పాటునైనా ఇతరులను విమర్శించడం గాని పొగడడం గాని చేయకపోవడం.
5. తనను నమ్ముకున్నవారి కొరకు ఎంతటి కష్టాన్నైనా అనుభవించి సహాయం చేయడం.
6. సత్యం, ధర్మం తప్పకుండా జీవిత యాత్ర సాగించేవారే గాని కష్టాలకు వెరచి సత్యం ధర్మం తప్పేవారు కాదు.
7. భూదేవి కంటే ఎక్కువ ఓర్పు కలిగి యుండడం.
8. భయమంటే ఎలాంటిదో తెలియని జీవిత విధానం.
9. దానం చేయడమే తన జీవిత విధానంగా గలిగి చివరకు తన శరీరాన్నీ కూడా తనన్నాశ్రయించిన వారి కొరకు బాధలకు గురిచేయడం.
10. భగవద్గీతలో చెప్పబడ్డ దైవీసంపద లక్షణాలన్నీ యథాతథంగా స్వతసిద్ధమై ఉండడం.
11. అలాగే భక్తియోగంలో భక్తుని లక్షణాలన్నీ సంపూర్ణంగా ఆచరణలో గలవారై ఉండడం.

మనమెంత గొప్ప వేడుకలు చేసినా అన్న దానాలు, అలంకరణలు చేసినా అవన్నీ మన తృప్తి కొరకే గాని శ్రీస్వామివారిని మెప్పించ లేవు. శ్రీస్వామివారివలె మనం నిస్వార్థంగా సాటిజీవులకు సేవ చేయడ మొక్కటే వారిని మెప్పించేది. అవధూత రూపంలో ఉండి కేవలం గోచి గుడ్డతోను, పాత దుప్పటితోను జీవితాన్ని గడిపి మనకు

ఆదర్శప్రాయులయ్యారు. సాటి జీవుల బాధ నివారించడమొక్కటే జీవిత ధ్యేయంగా జీవించారు. తన ముక్తి కొరకు తపన పడలేదు. తనను గూర్చి నలుగురూ గొప్పగా ప్రచారం చేయాలనే మాట పూర్తిగా వ్యతిరేకించారు. చివరి వరకు తన కుటీరానికి తలుపు, ద్వారబంధ్రం లేకుండా జీవించారు. ఈ విధానాన్ని మనం ఆచరించనంత కాలం మనం నిజమైన స్వామి భక్తులం కాలేము. అలాంటి ఆచరణ కలిగిన నాడు మనం వద్దన్నా శ్రీస్వామివారు మన అండనుంటారు. "అన్నీ జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోయ్యా" ఇదే మనం శ్రీస్వామివారిని నిజంగా సేవించే పద్ధతి కావాలిగాని అలంకరణలు, వేడుకలూ, శ్రవణానందకరమైన పాటలు మాత్రమే శ్రీస్వామివారి సేవలని తలవడం "అచ్చపు చీకటి" అవుతుంది.

ఆకలై కొంగుబట్టిన వారికి అన్నంపెట్టమన్నారు. ఆకలైన వారికందరికీ పెట్టమనలేదు. నిజంగా అన్నార్తులకు, దేహి అని యాచించినవారిని వదలిపెట్టి లక్షాధికారులకు వడ్డించమనలేదు. ఇది మన ఆచరణలో వచ్చిననాడు శ్రీస్వామివారు మనంవద్దన్నా మన అండనుంటారు.

ఇట్టి మహోన్నత సద్గుణములన్నీ తానాచరించి అలా ఆచరించి నందున ఎంతటి ఉన్నతస్థితి కల్గుతుందో మానవాళికి తెల్పిన మహనీయమూర్తి గదా శ్రీవెంకయ్య స్వామివారు. వారి జీవితచరిత్ర చదివిన ప్రతివారికి వారిలాగానే జీవించాలనే



కుతూహలం కలుగక పోదు. అలాంటి ఆచరణ మనలో గూడా కలిగేటట్లు దయచూడమని ఆ మహనీయుని హృదయ పూర్వకంగా ప్రార్థిద్దాం.

జై సద్గురు రాయహా.

శ్రీ స్వామివారు తన్నాశ్రయించిన వారి ఎడల ఎంతటి కరుణామయులో తెల్పేదే ఈ తొగురు వెంకయ్య గారి అనుభవం. వీరు రైల్వేలో మెయిల్గార్డుగా పనిచేసి రాష్ట్రపతి అవార్డు పొందారు. ప్రస్తుతం రిటైర్ అయిఉన్నారు. ఒకప్పుడు వీరి వెన్నెముకలో బెనుకు వలన విపరీతంగా నొప్పివచ్చింది. ఆపరేషన్ చేసినా గ్యారంటీ లేదన్నారు డాక్టర్లు. వీరు శ్రీ స్వామివారిని ఆశ్రయించగానే చిన్న స్వప్నం ద్వారా వీరిబాధ నివారణచేశారు. ఎన్నో వేలమంది భక్తులున్నప్పటికీ మహాసమాధి అనంతరం వీరొక్కరికే శ్రీ స్వామివారు మంత్రోపదేశం చేయడమే వీరి ప్రత్యేకత. **1994** సం|| ప్రాంతంలో వీరి కన్నుకు పొరవచ్చింది. ఆపరేషన్ చేయించుకోమంటారా? అని ఒక చీటి, ఆపరేషన్ వద్దని శ్రీ స్వామివారి ఆజ్ఞఅని మరియొక చీటి పెట్టారు. ఆపరేషన్ వద్దని చీటీ వచ్చింది. దీనికి తోడు ఒకరోజు వీరి స్వప్నంలో శ్రీస్వామివారు కత్తి తీసుకొని కళ్ళు ఆపరేషన్ చేస్తానంటున్నారు. శ్రీస్వామివారు మూడుమార్లు అడిగితే వీరే మూడుమార్లు వద్దు స్వామి అని చెప్పారు. అది మొదలు సంవత్సరాలు దొర్లిపోతున్నా కన్ను ఆపరేషన్

చేయించుకోలేదు. ప్రస్తుతం రెండవ కన్నుకూడా పొర వచ్చినందున కనిపించదు. ఏ పుస్తకమూ చదవలేడు. చదివేందుకు ప్రయత్నిస్తే కళ్ళవెంబడి నీళ్ళు కారి నొప్పివస్తుంది. దోవ కనిపించదు. లైట్ల వెలుతురులో అసలే కన్పించదు. ఒక రోజు వీరికి మౌన బోధ అనే పుస్తకం పోస్టులో పంపారు. పుస్తకం చేతికి తీసుకొని కళ్ళద్దుకొని పుస్తకం పేరు చదివాడు. కళ్ళు నొప్పిలేదు. మహా అద్భుతంగా పుస్తకమంతా చదివినంత వరకు చూపు బాగానే ఉండింది. కళ్ళనీళ్ళు, నొప్పులు లేవు. పుస్తకం చదవడం అయిపోగానే చూపు తగ్గింది. ఈ దివ్యానుభవానికి ముగ్ధుడై వెంటనే గొలగమూడి వచ్చి సమాధి దర్శించి తన కృతజ్ఞతా భావం తెలుపుకోవాలని ఉబలాట పడ్డాడు. కొమారుడు ఇంట్లో లేడు. కోడలు వీరిని ఒక్కరినే పంపేందుకు భయపడుతుంది. ఆటో వానికి చెప్పి రైలెక్కించమనింది. ఈయన రైల్వేస్టేషను దగ్గర ఆటోదిగి అతనిని పంపేశారు. తానొక్కడే ప్లాట్ ఫారం మీదకొచ్చి రైలెక్కాడు. నెల్లూరు లో రైలు దిగి స్టేషన్ బయట వరకు నడచి వచ్చి మరలా R.T.C. బస్టాండు వరకు ఆటోలో వచ్చి బస్సెక్కి గొలగమూడిలో దిగారు. గొలగమూడి రాగానే మరలా చూపు తగ్గింది. స్నేహితుని ఇంటికి రాలేక కర్రతుమ్మచెట్లలో రోడ్డు ప్రక్క తంటాలు పడుతుంటే ఎవరో పుణ్యాత్ముడు ఆ ఇంటికి తీసుకువచ్చాడు.

కళ్ళు కనిపించక పుస్తకాలు చదవడం మానేసిన వీరికి



చూపు నిచ్చి తన దివ్యలీలలు స్వయంగా చదివేటట్లు చేయడమే గాక గొలగమూడికి వచ్చినంత వరకు చూపు ఇవ్వడం, గొలగమూడి చేరగానే చూపు ఉపసంహరించడం ఎంత అద్భుతమో చూడండి. నీ కవసరమైనదంతా నేనే చేస్తాను. చూపులేదని బాధ పడవద్దని శ్రీస్వామివారు వీరికి దివ్యబోధ చేస్తున్నారు. ఈ బోధను వీరి అనుభవం ద్వారా గ్రహించి మనస్సులో శ్రీస్వామివారి ఎడల కొరత లేకుండా జీవించాలని వారికేగాక మనందరికీ శ్రీస్వామివారు బోధిస్తున్నారు.

ఖమ్మంజిల్లా దమ్మపేట కాపురస్తుడు పాలెపు సూర్య చంద్రరావు తన దివ్యానుభవం ఇలా వివరిస్తున్నారు.

నాకు ధూమపానం (పొగ త్రాగడం) అలవాటు ఉండేది. రోజుకు ఐదారు రూపాయలు ఈ దురభ్యాసానికై ఖర్చు చేయవలసి వచ్చేది. ఈ దురభ్యాసం లేకుండా చేయమని శ్రీస్వామివారిని ప్రార్థించాను. శ్రీస్వామివారి ఆరాధనకు కూడా వచ్చాను. నిత్యం శ్రీస్వామివారినీ విషయమై ప్రార్థిస్తూనే ఉన్నాను. కొంత కాలం తరువాత నా స్వప్నంలో అగ్ని రూపం దాల్చిన ఇద్దరు వ్యక్తులు కనిపించారు. వాళ్ళిద్దరు ఏకమై ఒక్క రెప్పపాటు కాలములో ఒక్కరైపోయారు. స్వప్నం అంతరించింది. అది మొదలు నాకీ దురభ్యాసం పూర్తిగా లేకుండా పోయింది. నా అనుభవం పదిమందికి చెప్పి శ్రీస్వామివారి కృప వారు కూడా

పొందేటట్లు చేయడమొక్కటే నేను శ్రీస్వామివారికి చేయగల సేవ అని భావిస్తున్నాను. భగవంతుడు:-

1) సర్వ వ్యాపకుడు:- అంతటా ఉన్నవాడు.

2) సర్వజ్ఞుడు:- ఈ సృష్టిలో సర్వమూ తెలిసిన వాడు.

3) సర్వ సమర్ధుడు:- ఏదైనా చేయగల సామర్ధ్యము గల వాడని సర్వ శాస్త్రాలు చెపుతున్నాయి.

భగవంతుని యొక్క ప్రతి రూపాలే శ్రీవెంకయ్యస్వామి వంటి మహానీయుల రూపంలో భక్త జనోద్ధరణ కొరకు భూమిపై అవతరిస్తారు. ఆశ, వ్యామోహములలో పడ్డ మానవులు సద్గురువుల రూపంలోని ఆ మహానీయులను తలవకున్నా ఆపద: సమయంలో తన భక్తులను ఆదుకొనడం చూస్తాము. "వారు నిరంతరము మన వైపు చూస్తుంటే మనం ఆలోచనలలో మునిగి ఎక్కడో చూస్తుండడం అపచారంగదా" . మనకు ఆపద వచ్చాక వారికి చెప్పుకోవడం, పారాయణలు, మ్రొక్కు బడులు, ప్రదక్షిణలు చేశాక వారా ఆపద తీర్చడం ఒక పద్ధతి. అలాగాక ఆ ఆపద రాకముందే మనలను జాగ్రత్తపరచి ఆ ఆపద మనకు సంభవించకుండా చేయడం వారి మాతృప్రేమకు నిదర్శనము గదా!

ఫె. సుబ్బరామయ్య కొమారుడు నిద్రపోతే లేపేది చాలా కష్టము. ఒక రోజు ఇంటి నిండా అతిధులున్నందున వాడు గోడనాను కొని చాపమీద పడుకొని యున్నాడు. వాని ప్రక్కన సుబ్బరామయ్య పడుకొని యున్నాడు. అర్ధ రాత్రి వేళ



అతని మొద్దు నిద్ర ఏమైందో అక్కడ గోడ మీద తేలుందని తండ్రిని నిద్ర లేపాడు. అక్కడ తేలుందని నీకెలా తెలిసిందిరా అంటే " ఆ తేలు నా కాలు గీకుతుంది. అప్పుడే నాకు మెలుకువ వచ్చింది. చూస్తే తేలుఉంది." అని చెప్పాడు. అతడు తన నిద్రలో తన కాలుతో దాన్ని అలా కదిలిస్తే అది కసికొద్దీ గట్టిగా కుట్టి ఉండేది. అలా జరగకుండా వీడికి మెలుకువ గల్గించి తేలును గుర్తు పట్టేటట్లు చేశారు. తేలు కుట్ట వలసి ఉంది. దాని కొండె వీణ్ణి తాకింది. కానీ విషం మాత్రం ఇతని శరీరంలోకి ప్రవేశ పెట్టనివ్వలేదు. మనం ఏమరి ఉన్న సమయంలో కూడా శ్రీస్వామివారు మనలను రక్షించడమంటే అదే కదా!

స్మృతి మాత్ర ప్రసన్నుడనే విషయాన్ని చల్లా శ్రీరాములు శెట్టి గారు క్రిష్ణపట్నం, నెల్లూరు జిల్లా ఇలా వివరిస్తున్నారు. నేను అనికేపల్లి నుండి నిత్యం బిక్షాన్నం శ్రీస్వామివారి ఆశ్రమానికి తేవడం అనే సేవ చేస్తున్నాను. **1995** వ సం|| లో రేపు సంక్రాంతి పండుగ అనగా నాకు చలి జ్వరం, విపరీతమైన వళ్ళు నొప్పులు వచ్చాయి. వళ్ళు నొప్పులను తట్టు కోలేక పిల్లకాయల చేత నా వళ్ళంతా చాలా సేపు తొక్కించుకొన్నాను. పండుగరోజు భక్తులందరూ తాము చేసుకున్న తినుబండారాలు శ్రీస్వామివారికి సమర్పించు కోవాలని ఆశతో ఉంటారు. నేను బిక్షకు పోకుంటే వాళ్ళంతా బాధ పడుతారు. గనుక రేపు బిక్షకు వెళ్ళేటట్లు

చేయమని శ్రీస్వామివారిని ప్రార్థించాను. నాకు నిద్ర రాలేదు. నాముందు బారడు దూరంలో నా వైపే కన్నార్పక చూస్తూ శ్రీస్వామివారి సేవకుడు ఒకరు నిలబడి ఉన్నారు. ఈమనిషి ఇక్కడి కెలా వచ్చాడు? అని అనుకొంటూ ఆ వ్యక్తి తిరిగి ఈ కుటీరం నుండి బయటకు వెళ్ళేటప్పుడు పలకరించాలనుకొన్నాను. మరు క్షణంలో ఆ వ్యక్తి అక్కడ లేడు. అంత వరకు నన్ను బాధ పెట్టిన చలి జ్వరం, వళ్ళునొప్పులు అంతులేకుండా పోయాయి. తెల్లవారి యథాతథంగా బిక్షకు వెళ్ళి వచ్చాను. రాత్రి నాకు కుటీరంలోకనిపించిన సేవకుణ్ణి అడిగితే నేనాచాయలకే రాలేదు అంటాడు. అప్పుడర్ధమైంది. ఆ వ్యక్తి అలా కనిపించకుంటే నాకు జ్వరం, వళ్ళు నొప్పులు మామూలుగా తగ్గాయని భావిస్తానని శ్రీస్వామివారే ఆ రూపంలో దర్శన మను గ్రహించి నా బాధను తొలిగించారని రూఢి అయింది.

చిత్తలూరు అవతల చీరలవారికండ్రిక, నెల్లూరు జిల్లా గ్రామ కాపురస్తురాలు కట్టా వెంకటసుబ్బయ్య భార్య రామలక్షమ్మ ప్రస్తుతం నెల్లూరు రంగనాయకులపేట జీనిగలవారి వీధిలో కాపురమున్నారు. శ్రీస్వామివారికి ఈమె ఎప్పుడో తనకు పెండ్లి కాకముందు చేసిన సేవకు గాను శ్రీస్వామివారు తనను అవిటితనం నుండి రక్షించిన విధం తెలుపు తుంది.

**1994** వ సం|| లో నేను పూర్తిగా షుగర్ పేషంటును.



అప్పుడు నాకు ఎడమకాలు బొటన వ్రేలిపై గడ్డ లేచి కాలంతా వాచిపోయి మహంతమైన బాధ అనుభవిస్తున్నాను. ఆర్థికముగా పేదరాలును అయినందున మద్రాస్ స్టాన్ లీ హాస్పిటల్ లో ఉచిత వైద్యం కొరకు చేరాను. కొందరు డాక్టర్లు బొటన వ్రేలు తీసెయ్యాలంటే, మరి కొందరు పాదం సగం తీసెయ్యాలనీ, ఇంక కొందరు పాదమంతా తీసెయ్యాలనీ షుగరుపేషంటు గనుక పత్యం చాలాజాగ్రత్తగా ఉండాలని చెపుతున్నారు. విపరీతమైన బాధ, ఏడ్చుకుంటూ పడుకున్నాను.

నా స్వప్నంలో మేళతాళాలతో ఊరేగింపు వస్తుంది. శ్రీవెంకయ్య స్వామివారు వస్తున్నారని చెపుతున్నారు. నేను దగ్గరకు పోకముందే ఉత్సవం మలుపు తిరిగి వెళ్ళిపోయింది. కన్నీటితోనే మెలుకువ వచ్చింది. "స్వామీ! తమరు నన్నీకష్ట కాలంలో మరచి పోకుండా గుర్తుచేస్తున్నారా? ఆపరేషన్ లేకుండా కాలు నయంచేసి ఇంటికి చేర్చారంటే మీ ఆశ్రమంలో ఒక్క నెల సేవ చేస్తాను. నాకేదైనా శక్తి ఉంటే హుండీలో వేస్తానని మ్రొక్కు కున్నాను.

తెల్లవారి వేలూరు నుండి విజిటింగ్ డాక్టరమ్మ వచ్చి కాలు తీసేస్తే ఈమె జీవితాంతం అవిటిదౌతుంది. షుగర్ నరాలకు వ్యాపించ లేదు. రక్తమెక్కించి, మంచి ఆహారం మాంసం వగైరా ఇచ్చి ఇంజెక్షన్లతోనే మాన్పమని వ్రాసి వెళ్ళి పోయింది. అలా చేయగానే శ్రీస్వామివారి కృప వలన వారం పది రోజులలోనే ఆపరేషన్ లేకుండానే కాలు